
**1988** సెప్టెంబరు 5 సోమవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణగారి జన్మదినం. ఉపాధ్యాయ దినోత్సవం. పాఠశాలకు పండుగ దినం.




రంగురంగుల కాగితాలతో సందడిగా పెళ్లి వారిల్లులాగ ఉంది స్కూలు. ప్రారంభసమయానికి ముందుగానే ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరయ్యారు. జాతీయ గీతాలు, దేశభక్తి గీతాలు పాడుతుండగా మువ్వన్నె పతాకం వినువీధుల్లో విహరించింది. అధికారులు, అనధికారులతోకలసి అసెంబ్లీ హాలులో సమావేశమయింది పాఠ శాల.

మా పాఠశాలలో సాధారణంగా ఏ కార్యక్రమం జరిగినా సోమయాజిగారే సభానిర్వహణ చేసేవారు. ఈ దినం ఆ కార్యక్రమం అయన నాకప్పగించడంతో కంగారు పుట్టినా సంతృప్తిగానే సభాప్రారంభం చేయగలిగాను.

సభాధ్యక్షుని, ఉపన్యాసకులను, అతిథులను వేదిక మీదకు ఆహ్వానించి సభాకార్యక్రమ నిర్వహణను సభాధ్యక్షులకు అప్పగించి నాస్థానం చేరుకున్నాను.

సభాధ్యక్షులయిన మా పాఠశాల హెడ్మాష్టారు, మరికొంతమంది ప్రజాప్రతినిధులు సర్వేపల్లిరాధాకృష్ణగారి గురించి, ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యత గురించి చెప్పి ముగించారు. తరువాత ప్రారంభం అయింది లోకనాథం ఉపన్యాసం.

లోకనాథం గురించి ఇక్కడ కొంచెం చెప్పాలి. లోకనాథం మా స్కూలులో లెక్కల మాష్టారు. తన కులం వాళ్లయిన కొందరు ఉపాధ్యాయులకు, మరి కొంతమంది విద్యార్థులకు నాయకత్వం వహిస్తాడు.

ప్రతి పాఠశాలలోను రెండు వర్గాలుంటాయి. ఒక వర్గానికి సాధారణంగా ప్రధానోపాధ్యాయుడు నాయకత్వం వహిస్తే వేరొక వర్గానికి లెక్కల మాష్టారో, సైన్స్ మాష్టారో నాయకత్వం వహిస్తారు. సర్వసాధారణంగా అయిద్దరివీ రెండు వేరువేరు కులాలయి ఉంటాయి. సజాతి ధృవాలు వికర్షించుకోవడం, విజాతి ధృవాలు ఆకర్షించుకోవడం అయస్కాంత ధర్మం అయితే, సజాతి ఆకర్షణ, విజాతి వికర్షణ అనేది విద్యాలయాల ధర్మం. అలాంటి అమాంబాపతు వర్గానికి చెందినవాడు లోకనాథం.

లోకనాథం ఉపన్యాసం గంగాప్రవాహంలా సాగుతుంది. అందులో సూక్తులున్నాయి. సుభాషితాలున్నాయి. చెణుకులున్నాయి, చమత్కారాలున్నాయి, వెక్కిరింతలున్నాయి, వేళాకోళాలున్నాయి.

"గురువు తల్లిదండ్రులతో సమానం. అటువంటివాడు కులం పేరుతో, మతం పేరుతో అకారణంగా విద్యార్థులను హింసించడం, పక్షపాతం చూపించడం...ఉపాధ్యాయ వృత్తిని అవమానం చేసినట్లవుతుంది."

లోకనాథం మాటలు చర్నకోలా దెబ్బల్లా తగిలాయి నాకు. ఉలిక్కిపడి సోమయాజిగారి వంక చూసాను. ఎర్రగా కందిన అతని ముఖం, ఉబ్బిరించిన ముక్కు అతని అంతరాన్ని చెప్పకనే చెబుతున్నాయి. లోకనాథం ఉపన్యాస ధోరణిని గమనించిన ఉపాధ్యాయులంతా ముళ్ళమీద కూర్చున్నట్లు అసహనంగా కదులుతున్నారు.

ఉపన్యాసం ముగించిన లోకనాథం కళ్లల్లో ఏదో సాధించానన్న తృప్తి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మాటలతో ఎదుట వారిని నొప్పించి వారు బాధతో విలవిల్లాడుతుంటే ఆనందంతో పలవరించే వారు ఎంతోమంది ఉన్నారు. గుండెల్లో శత్రుత్వం విశ్వరూపం చూపిస్తుంటే వచ్చే అవకాశాన్ని జారవిడిచేవారెందరు ?


లోకనాథం సోమయాజిగారిని ఉద్దేశించి అమాటలన్నాడని ప్రతి ఒక్కరికి తెలుసు. సోమయాజిగారంటే లోకనాథానికి మంట. పూర్వం ఇద్దరూ మంచి స్నేహితులట. కుండ బద్దలు కొట్టే సోమయాజిగారి నిష్కర్షత లోకనాథాన్ని బాధించింది. తరువాత తరువాత పాఠశాల గ్రూపు రాజకీయాల్లో ఇద్దరూ రెండు భిన్న ధృవాలయ్యారు.

సోమయాజిగారు మంచి పండితులు. వక్త. పద్యాలను అమోఘంగా చదవగలరు. వారు క్లాసులో పాఠం చెబుతుంటే పిల్లలతో సమానంగా వినాలనిపించేది నాకు. అయనంటే నాకే గాదు చాలామందికి మంచి అభిప్రాయముంది. పిల్లలు కూడా అతనంటే ఎంతో గౌరవిస్తారు.

అలాంటి అయన క్లాసులో పిల్లవాడిని బెల్టుతో కొట్టారని రిపోర్టు రాగానే ఆశ్చర్యపోయాం. కేవలం కులదృష్టితో మాత్రమే ఆ విద్యార్థిని అంతలా కొట్టారని ఆ కుర్రవాడు చెప్పడం మరీ ఆశ్చర్యమనిపించింది. హెడ్మాష్టారి ప్రాథమిక విచారణ జరుగుతుండగానే ఆ విషయం అధికార్లకు తెలియజేయడం జరిగింది. మొత్తం అంతటితో లోకనాథం ప్రచ్ఛన్న హస్తం ఉందనడం సర్వజన విదితం.

అధికారుల తనిఖీ ఉందన్న రోజు హఠాత్తుగా పాఠశాల విద్యార్థులు సమ్మె చేశారు. ధనం, రౌడీయిజం విద్యాలయాలను పరిపాలిస్తున్నంత కాలం సరిఅయిన విద్యార్థికి, ఉపాధ్యాయునికి నిలవ నీడ ఉండదన్న విషయం మరోమారు ఋజువయింది. కేవలం డబ్బున్న ఓ పదిమంది విద్యార్థులు చేసిన అల్లరికి వందలాది విద్యార్థులు

వెనుదిరిగి పోయారు. సమ్మె ఫలించింది.
అధికారులు పదిమంది విద్యార్థులు చెప్పింది విన్నారు. పసివారు అబద్ధాలు చెప్పరన్నారు. పద్యం కంఠతాచేయలేదన్న సాకుతో తనకులం కాని విద్యార్థిని దెబ్బతో



Niketanam, Acc. No. Vetapalem.

కొట్టడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయుడు పిల్లల్ని కొట్టడమే నేరమన్నారు. ఈ నేరానికి, ఈ పాపానికి తగిన శిక్ష ఏమిటని వితర్కించుకున్నారు. సోమయాజిగారు వయస్సులో తమకంటే పెద్దవారని, సభ్యసమాజంలో తనకంటూ ఒక స్థానాన్ని కలిగిన వారనీ, పరువు-మర్యాద గలవారనీ ఎంచకుండా ఇష్టమొచ్చినట్లుగా తెలుగు, ఇంగ్లీషు భాషల్లో తిట్టారు.

సిగ్గుతో చితికిపోతు మూగగా రోదించారు సోమయాజిగారు. తాను చేయని నేరం తనపై వేసి కనీసం తాను చెప్పే దాన్ని కూడా వినిపించుకోకుండా శిక్షించడానికి సిద్ధపడే అధికారులు, విద్యార్థులకు అక్షరజ్ఞానం కలిగించి తన చదువుకు సార్థక్యం ఏర్పరుచుకోవాలన్న తన తలపును గుర్తించకుండ కులకండూతిమలాన్ని పూసి వెక్కిరించే విద్యార్థులు, సాటివాడు అసహాయ స్థితిలో కొట్టుకుంటుంటే ఆనందంగా వీక్షించే తోటివారు, నిస్సహాయంగా మౌనంగా, అవనత శిరస్కులైన ఆయనను చూస్తుంటే "ఉపాధ్యాయుడా! మారని ఈ సమాజంలో నీస్థితికి మెరుగు లేదా?" అనిపించకమానదు ఎవ్వరికైనా!

సోమయాజిగారు సస్పెండ్ చేయబడ్డారని తెలిసి మేమెవ్వరం ఆశ్చర్యపోలేదు. అలా జరుగుతుందనీ మాకందర్కీ తెలుసు. కానీ కొద్దిమంది పిల్లలు కొంతమంది ఉపాధ్యాయులు మిఠాయిలు పంచుకున్నారని తెలిసి సిగ్గుపడ్డాం. ఆకష్టాన్ని, ఆ నిష్ఠూరాన్ని కూడా ఆయన చిరునవ్వుతోనే స్వీకరించారు. అది అతని శీలానికి అంగీకారమేగాని అవమానం కాబోదు.

మాసీమానని గాయాన్ని పుల్లతో కెలుకుతు రాక్షసానందాన్ని అనుభవించాడు లోకనాథం. ఎదురు దెబ్బ తగిలేవరకు ఇలాగే ప్రతిఒక్కరు మిడిసిపడతారు. దెబ్బ తగలగానే డీలా పడతారు.

నా ఆలోచనలు రకరకాలుగా సాగుతుండగానే సోమయాజిగారు మైకుదగ్గరకు వచ్చారు. వారి గొంతు గంభీర ధ్వనితో ఖంగుమంటోంది.

"నేటి సమాజంలో ఉపాధ్యాయుడు అల్పజీవి. ప్రతీ ఒక్కరు ఉపాధ్యాయుని పరీక్షించడానికి, అధికారం చెలాయించడానికి అతని మార్గం నిర్దేశించడానికి అర్హులే. అందువల్లే ఉపాధ్యాయునికి సమాజంలో గౌరవం లేకుండా పోయింది. ఏస

మాజం ఉపాధ్యాయుని గౌరవించదో అది అభ్యుదయం చెందలేదు."

"నిజమైన ఉపాధ్యాయుడు తనకు తెలిసిన ప్రతీ విషయాన్ని తన విద్యార్థులకు చెప్పాలనుకొంటాడు. తనకన్నా తన పిల్లలను ఉన్నతులను చేయాలను కొంటాడు. అంతేకాని తన కులం వాళ్లకి ఒకలాగ, వేరొక కులం వాళ్లకి ఇంకొకలాగ ఎప్పుడు చెప్పలేడు. అలా చెప్పేవాడు ఉపాధ్యాయుడేగాదు."

సోమయాజిగారి గుండెలోతుల్లో నుండి దూసుకు వచ్చే మాటలు వేల ఉపాధ్యాయుల అంతరంగాల్ని తరచినట్లనిపిస్తున్నాయి. అతను చెప్పే మాటలు అక్షర సత్యాలు అనిపిస్తుండగా అప్రయత్నంగా చప్పట్లు చరిచాను.

"ఈ దేశపు విద్యావిధానంలో ఉన్న అతి పెద్దలోపం గురుశిష్య సంబంధం. ఉపాధ్యాయుడు విద్యార్థి అన్నదమ్ముల్లా, తండ్రి కొడుకుల్లా, ప్రాణస్నేహితుల్లా గుండాలి. కానీ ఈనాడు వారిద్దరు బద్ధ విరోధుల్లా ఉన్నారు...ఆలోపం మనలో కూడా ఉంది. ఉరిమినట్లున్న ఆయన గొంతు మా లోపాలను ఎత్తి చూపుతుంటే అంతరాళంలో నా తప్పులను గుర్తించుకొంటు తలదించుకున్నాను."

"నిరుడు 10 వ తరగతి పబ్లిక్కు పరీక్షలో తెలుగులో నూటికి ఎనభై ఐదు మార్కులు నా విద్యార్థి తెచ్చుకుంటే

రాష్ట్రంలో అన్ని ఎక్కువ మార్కులు తెచ్చుకున్న అతి కొద్ది విద్యార్థులలో వాడు ఒక్కడైతే, నాకేమైనా అవార్డులిచ్చారా? ప్రమోషన్లు ఇచ్చారా? కనీసం ఏఒక్క అధికారి అయినా "మాష్టారూ బాగా చెప్పారండీ" అని అభినందించాడా? లేదే! నిర్లక్ష్యం ఉదాసీనత, ధనాన్వేషణ తత్త్వం అధికారుల్లో ఉన్నంతవరకు విద్యావ్యవస్థ ఇలాగే ఉంటుంది."

"ఉపాధ్యాయులు ఒకరికొకరు సహకరించుకొంటూ విద్యాప్రమాణాలను పెంచాలేగాని, కులమత తత్త్వాలను రెచ్చగొడుతు, అమాయక హృదయాలలో విషపుబీజాలు నాటినంతకాలం విద్యాలయాలు విద్యకు అలయాలు కాలేవు. విద్యాలయాలే అవుతాయి."

"నాప్రియమైన విద్యార్థులారా! భావి భారత నేతలుమీరే! మీరు స్థాపించే సమసమాజంలో ఉపాధ్యాయుడు అల్పజీవి కారాదు. విద్యావ్యవస్థ దండుగమారి అవస్థాకారాదు."

సోమయాజిగారి ఉపన్యాసం ముగిసినా వారిమాటలు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. వారి కలలు నిజమైతే ఆ మార్పు విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుని ఉన్నత స్థానం తలుచుకొని ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను నేను.

రాత్రి భోజనం చేస్తూ శ్రీమతితో ఉపాధ్యాయ దినోత్సవం సోమయాజిగారి ఉపన్యాసం గురించి వివరిస్తుంటే.

"నాన్నా తెలుగు మాష్టారు పంచె లాల్చీ వేసుకొంటారు కదా బెల్టెక్కడ పెట్టుకొంటారు?" అన్న బాబిగాడి ప్రశ్న నన్ను నిశ్చేష్టుడిని చేసింది.

